క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



నింగమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రమేష్ తల్లి నింగమ్మ (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మృతురాలి స్వగ్రామానికి వెళ్లి ఆమె భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట జేసీఎస్ మండల కన్వీనర్ శివకుమార్, నాయకులు మహాలింగప్ప, ఈరన్న, సోము తదితరులున్నారు.

4న విద్యార్థులకు క్రీడా పోటీలు

హిందూపురం: పట్టణంలోని విద్యారణ్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాల సరస్వతీ విద్యామందిరాల విద్యార్థి విభాగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. జూనియర్ లెవెల్ ఆటల పోటీలు 4వ తేదీ ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ క్రీడాపోటీల్లో దాదాపు 400 మంది బాల, బాలికలు పాల్గొంటారని చెప్పారు. అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించనున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని జంబులబండ 132 కేవీ సబ్‌స్టేషన్ విద్యుత్ లైన్ అత్యవసర మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో గుడిబండ, అగళి, రొళ్ల మండలాల్లోని విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు



మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రోడ్డుకు అడ్డంగా శుక్రవారం నేరేడు చెట్టుకు చెందిన పెద్ద కొమ్మ పడిపోయింది. దీంతో కొద్దిసేపు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. గమనించిన ఉద్యోగులు, స్థానికులు కొమ్మను పక్కకు తోశారు. ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వర్షాకాలం కావడంతో రోడ్డు పక్కన కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లను సంబంధిత అధికారులు గుర్తించి ముందు జాగ్రత్తగా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గోరంట్ల: మండల పరిధిలోని కాలేకుంటపల్లి గ్రామంలో శుక్రవారం వైద్యాధికారులు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, నీటి నిలువలను శుభ్రంగా చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రమణ, వైద్యసిబ్బంది, పంచాయతీ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన



దోమల నిర్మూలనకు మందు స్ప్రే చేయిస్తున్న వైద్య సిబ్బంది

అగళి: మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లి పంచాయతీలోని వడ్రహట్టి గ్రామంలో సబ్ యునిట్ అధికారి షమీవుల్లా ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా నివారణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సబ్ యునిట్ అధికారి షమీవుల్లా తెలియజేశారు. గత సంవత్సరం వడ్రహట్టి గ్రామంలో మలేరియ జ్వరాలు సోకాయని, అందుకే ముందు జాగ్రత్తగా గ్రామంలో దోమల నివారణ మందును స్ప్రే చేయించామన్నారు. వైద్యులు శివనంద, గాయత్రి, ఈఓఆర్డీ పద్మ, సూపర్‌వైజర్ నరసారెడ్డి, సుందరయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిఘా గాలికి

- కొడికొండ చెక్‌పోస్టులో పోలీసు సిబ్బంది కరువు
- జాతీయ రహదారిపై హాయిగా సాగుతున్న అక్రమ రవాణా
- పెరుగుతున్న చోరీలు
- పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు



44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో కనిపించని పోలీసులు

చిలమత్తూరు: నిఘా నీడలో ఉండాల్సిన రాష్ట్ర సరిహద్దు ప్రాంతాన్ని పోలీసు అధికారులు గాలికి వదిలేశారు. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పడి నుంచి అక్రమ రవాణాకు 44వ నంబరు జాతీయ రహదారి అడ్డాగా మారింది. అక్రమార్కులు హాయిగా వాహనాలను సరిహద్దు దాటించేస్తుస్తూ జేబులు నింపుకుంటున్నారు.

గతంలో వందలాది కేసులు

చిలమత్తూరు మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి ఉన్న కొడికొండ చెక్‌పోస్ట్‌లో పోలీసు నిఘా కరువైంది. ఎవరూ లేకపోవడంతో కర్ణాటక మద్యం, మాదక ద్రవ్యాల రవాణా జోరుగా సాగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపగా, వందలాది మందిపై కేసులు కూడా నమోదయ్యాయి. దీంతో అప్పట్లో అక్రమ రవాణా తగ్గిపోయింది. దీనికితోడు ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు కూడా స్థానిక స్టేషన్‌లో కూడా నమోదు అయ్యాయి. అయితే గత రెండు నెలల నుంచి పరిస్థితులు దారి తప్పాయి. ఇసుక, మట్టి, మద్యం, మాదవ ద్రవ్యాలు రవాణా జోరుగా సాగుతోంది. మండలంలోని కొడికొండ సమీపంలోని చిత్రావతి నదిలోని ఇసుకను అక్రమార్కులు దోచేస్తున్నారు.

పెరుగుతున్న చోరీలు

చిలమత్తూరు మండలంలో చోరీలు పెరుగుతున్నాయి. దొంగలు ఇళ్లలోకి చొరబడి నగదు, ఆభరణాలు దోచుకెళ్తున్నారు. దుకాణాల్లోనూ దొంగతనాలు జరుగుతుండటంతో స్థానికంగా పోలీసు నిఘా వ్యవస్థ నిర్వీర్యమైందన్న విమర్శలున్నాయి. ఇటీవల మరవకొత్తపల్లి బీసీలో కాలనీలో శంకర్‌రెడ్డి ఇంట్లో బంగారు నగలను దోచుకెళ్లారు. సంజీవరాయునిపల్లిలో టీస్టాల్ నడుపుకుంటూ జీవనం సాగించే నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలోని ఓ దుకాణంలో పట్టపగలే దొంగలు నగదు దోచుకెళ్లారు. ఇది సీసీ టీవీల్లో కూడా రికార్డు అయింది. దొంగతనాలు వరుసగా జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాల దొంగతనాలకు అడ్డు అదుపులేకుండా పోయింది.

సెలవులో ఎస్‌ఐ

స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ గంగాధర్ సెలవుపై వెళ్లిపోయారు. నెల రోజులుగా కిందిస్థాయి సిబ్బంది ద్వారానే స్టేషన్ నడుస్తోంది. మండలంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తినా, దోపిడీలు జరిగినా ఎస్‌ఐ లేకపోవడంతో నియంత్రణ గాడితప్పిందన్న విమర్శలున్నాయి. ఇక్కడ పనిచేసేందుకు కొందరు ఎస్‌ఐలు టీడీపీ నేతల ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. టీడీపీలో రెండు వర్గాలు కావడంతో ఎస్‌ఐ తమకు అనుకూలంగా ఉండే వారిని తెచ్చుకోవాలని ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. అయితే ఇప్పటి వరకూ జిల్లా పోలీసు యంత్రాంగం మాత్రం ఎవరినీ నియమించలేదు. లేపాక్షి ఎస్‌ఐ గోపీ ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా కొనసాగుతున్నారు.



చిలమత్తూరులోని ఓ దుకాణంలో నగదు అపహరిస్తున్న దొంగ (ఫైల్)

జోరుగా ఇసుక, మట్టి దందా



కొడికొండ వద్ద ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

అక్రమంగా ఇసుక, మట్టి తరలించకూడదన్న చట్టాలు ఉన్నా యథేచ్ఛగా మండలంలో అక్రమ రవాణా సాగిపోతోంది. అధికారులతో పాటు పోలీసు యంత్రాంగానికి ఈ దందా తెలిసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. మండలం పరిధిలోని చిత్రావతి నదిలో ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ సరిహద్దు దాటించేస్తున్నారు. మరికొందరు మట్టిని ఎక్కడ పడితే అక్కడ తవ్వేస్తున్నారు. ముఖ్యంగా చెరువుల్లో మట్టిని జేసీబీల ద్వారా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇసుక, మట్టిని పట్టపగలే తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల గ్రామంలోని కేజీబీవీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. చదువు కునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పోలీసుల అదుపులో దొంగ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వారపు సంతలో సెల్ ఫోన్ల అపహరణకు పాల్పడుతున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం జరిగిన సంతలో సెల్‌ఫోన్ చోరీ చేస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ విచారణ చేస్తున్నారు. కర్నూలు జిల్లా డోన్ ప్రాంతానికి చెందిన కొందరు ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్లు చోరీకి పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫోన్లు రికవరీ చేస్తున్నట్లు సమాచారం.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ సమీపంలోని చిత్రావతి నది నుంచి శుక్రవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ పోలీసులు సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికపై సమావేశం

లేపాక్షి/అగళి: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికకు లేపాక్షి, అగళి మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, భాస్కర్, చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఇందులో భాగంగానే ఆయా ప్రాంతాల్లో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఎంసీ నోటిఫికేషన్ విడుదలైందని, నోటీసు బోర్డుల్లో ఓటరు జాబితా ప్రదర్శించామన్నారు. 5న అభ్యంతరాల స్వీకరణ, 8న ఎస్ఎంసీ సభ్యులచే చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేసి తొలి సమావేశం నిర్వహిస్తారన్నారు.

భూ అక్రమాలపై విచారణ చేయించండి

సోమందేపల్లి: ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం వెంటనే భూపంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వెంకటేశ్వర కల్యాణ మంటపంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూఅక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. పేదలకు ఇంటి పట్టాలు, రైతులకు సాగు పట్టాలు ఇవ్వాలని కోరారు. అసైన్మెంట్ చట్ట సవరణను కూడా రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్, నాయకులు అచ్చమ్మ, ఇంతియాజ్, పెద్దన్న, గంగాదర్ నారాయణ, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

దేశ సేవలో విద్యార్థుల పాత్ర కీలకం

పరిగి: దేశ సేవలో విద్యార్థుల పాత్ర కీలకమని ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కొడిగెనహళ్లి పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక ప్రక్రియ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జరిగింది. 10ఏ నెల్లూరు బెటాలియన్ నుంచి వచ్చిన సెలక్షన్ ఆఫీసర్ బాదల్ పాండ నేతృత్వంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఎన్‌సీసీలో చేర్పించడానికి ఆసక్తిని ఎన్‌సీసీ అంటే సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేయడమేనన్నారు. ప్రతి ఒక్కరూ పొరుగు వారి పట్ల స్నేహపూర్వకంగా మెలగాలన్నదే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నేవీ అధికారి నాగమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

'సుప్రీం' తీర్పుతో మాదిగలకు న్యాయం

మడకశిర: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిన నేపథ్యంలో ఆయన శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ కోసం దశాబ్దాల నుంచి పోరాటం చేయడంతోనే ఈరోజు ఫలితం దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, దళిత సంఘం నాయకులు శ్రీనివాస్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

పట్టణంలో శుక్రవారం నియోజకవర్గంలోని మాదిగలు పార్టీలకు అతీతంగా సమావేశమయ్యారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో వారంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్, ఈరన్న, జెడ్పీటీసీ సభ్యులు భూతరాజు, పీఆర్ నరసింహమూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్, న్యాయవాది అశ్వర్థ నారాయణ, డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతు, దళిత నేతలు సునీల్‌కుమార్, రాయుడు, ఎల్‌కే నరసింహప్ప, లాయర్ మూర్తి, జయకుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు భూతన్న, మాలింగప్ప, రంగనాథ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, తాహిర్‌వలి, లక్ష్మీనారాయణ, కదురన్న, మద్దిలేటి, సురేష్, నంజప్ప, రంగయ్య, రెహమాన్, శివయ్య, నరసింహమూర్తి, గోవిందప్ప, కిషోర్, రామాంజి, నిజలింగప్ప, గోవిందరాజులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

గుడిబండ: ప్రజలు మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడకుండా ప్రతి శుక్రవారాన్ని డ్రైడే పాటించాలని మెడికల్ ఆఫీసర్ సౌందర్య అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కుక్క అడ్డురావడంతో బైక్ బోల్తా

- ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన బాధితులు

పరిగి: మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు.. శ్రీరంగరాజుపల్లికి చెందిన కృష్ణారెడ్డి మరో వ్యక్తితో కలిసి పరిగి వైపు నుంచి హిందూపురానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరి వెళ్తున్నారు. పరిగి మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం సమీపంలోని ఓ లేఅవుట్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనానికి అడ్డుగా కుక్క రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో కృష్ణారెడ్డితో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరికీ కాళ్లకు, చేతులకు, తలకు బలమైన గాయాలయ్యాయి. హుటాహుటిన 108 వాహనంలో ఇరువురినీ హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 60 గర్భిణులకు డాక్టర్ వెంకట చిరంజీవి పరీక్షలు నిర్వహించారు. తర్వాత కరణం రమామణి సేవా ట్రస్ట్ ప్రతినిధులు వారికి పౌష్టికాహారం అందించారు.

రికార్డుల పరిశీలన

అగళి: మండల పరిధిలోని రావుడి గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ఏఓ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష



గుడిబండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రొళ్ల: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిముర్రుపాలు శ్రీరామ రక్షలాగా పని చేస్తాయని చిల్డ్రన్ స్పెషలిస్ట్ బాలప్రణీత్‌రెడ్డి, స్త్రీ వైద్య నిపుణులు చాంద్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్య, ఆశ వర్కర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. తర్వాత బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, వాసుదేవరెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: ప్రతి బిడ్డకూ తల్లిపాలే ఆరోగ్యకరమని సీడీపీఓ శాంతలక్ష్మి, సూపర్‌వైజర్ పుష్పలత పేర్కొన్నారు. పట్టణంలోని జీఐసీ కాలనీ, వజ్రాలపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ, సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాలను బిడ్డకు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తే బిడ్డ అనారోగ్య పరిస్థితి క్షీణిస్తుందన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని గుండుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల పోస్టర్లను శుక్రవారం డాక్టర్లు విజయశాంతి, శ్రీనివాసులు నాయక్ వైద్య సిబ్బందితో కలిసి విడుదల చేశారు. ఈ నెల 7వ తేదీ వరకూ ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కదిరేపల్లి, గుండుమల ప్రాథమిక వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ: తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని వైద్యాధికారిణి సౌందర్య అన్నారు. తల్లిపాల వారోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలను తక్కువ చేసి చూడకుండా వాటి ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: పుట్టిన బిడ్డకు మొదట ఇచ్చే ముర్రుపాలు బిడ్డకు మొదటి వ్యాధినిరోధక టీకా అని కల్లుమర్రి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సరస్వతమ్మ తెలిపారు. కల్లుమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయి నాగిరెడ్డి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వీఓఏలకు శిక్షణ

అమరాపురం: స్థానిక వైకేపీ కార్యాలయంలో వీఓఏలకు లోకోస్ సర్వేపై ఏపీఎం తిప్పన్న ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఏ విధంగా సర్వే చేయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం తిప్పన్న

భక్తిశ్రద్ధలతో ఆషాఢ పూజలు



అమరాపురం: ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి



లేపాక్షి: ముత్యాలమ్మకు పూజలు చేసిన దృశ్యం



రొళ్ల: అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

అమరాపురం: ఆషాఢం సందర్భంగా మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పున్నమి వెన్నెల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే గ్రామ దేవత చోళమాంబ దేవిని అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన పూజలు చేశారు. తర్వాత భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలతో పాటు గాజులు, వడి బియ్యం సమర్పించి పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

లేపాక్షి: మండలంలోని గొంగటిపల్లిలో వెలసిన ముత్యాలమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి అభిషేక అర్చనలు, మహామంగళహారతి ఇచ్చారు. ప్రతి ఏడాది ఆషాఢమాసం చివరి శుక్రవారం కావడంతో ఆనవాయితీగా పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. అలాగే లేపాక్షి ఆలయంలో వెలిసిన దుర్గాదేవికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన గ్రామీణ క్రీడాపోటీలు

పావగడ: స్థానిక క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న నిడుగల్ హోబళి స్థాయి ఉన్నత పాఠశాల విద్యార్థుల గ్రామీణ క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో 15 ఉన్నత పాఠశాల విద్యార్థులు తలపడ్డారు. కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం, వాలీబాల్, హ్యాండ్‌బాల్, త్రో బాల్ తదితర పోటీలు జరిగాయి. కబడ్డీలో మంజునాథ ఉన్నత పాఠశాల, ఖోఖోలో అరసికెర ప్రభుత్వ పాఠశాల జట్లు విజయం సాధించాయి.

మారెమ్మ జ్యోతుల ఉత్సవం

హిందూపురం: స్థానిక ఆటోనగర్‌లోని భగీరథకాలనీ మధుగిరి మారెమ్మ ఆలయంలో శుక్రవారం జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళలతో మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులను తలపై మోసుకొచ్చి ఆలయంలో అమ్మవారికి సమర్పించారు.



జ్యోతులతో భక్తులు